క్లుప్తంగా

సకాలంలో వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు



మలకపల్లి పీహెచ్‌సీలో వైద్య సేవలను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: పీహెచ్‌సీల్లో గర్భిణులకు అన్ని రకాల వైద్య సేవలను సకాలంలో అందజేయాలని డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మలకపల్లి పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పెద్దేవంలో జరుగుతున్న ఎన్‌సీడీసీడీ-3 సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన వారి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సర్వేను మార్చి 31లోగా పూర్తి చేయాలన్నారు. పీహెచ్‌సీల్లో నెలకు కనీసం ఐదు ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందజేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ స్లిప్పులు సిద్ధం



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ స్లిప్పులను సిద్ధం చేస్తున్న సిబ్బంది

తాళ్లపూడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను చేస్తున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ, మండలంలోని గ్రాడ్యుయేట్ ఓటర్లకు పంపిణీ చేయడానికి ఓటర్ స్లిప్పులను సిద్ధం చేసినట్టు చెప్పారు. మండలంలో 1,935 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, పంచాయతీ కార్యాలయంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ స్లిప్పులను బీఎల్‌వోలు, బీఆర్వోలు ఇంటింటికీ వెళ్లి అందజేస్తారని, స్లిప్పులు అందకపోతే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

మండలంలో 2,651 మంది ఓటర్లు

ఉండ్రాజవరం: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో 2,651 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 1,575 మంది పురుషులు, 1,076 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు, ఎంపీపీ పాఠశాల నంబర్-2లో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

బాధితులకు ఆర్థిక సాయం



అచ్చన్నపాలెంలో ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: అచ్చన్నపాలెంలో అనారోగ్యంతో బాధ పడుతున్న జాలపర్తి అనసూయమ్మకు మానవత సంస్థ రూ.4 వేల ఆర్థిక సాయం అందజేసింది. అలాగే, అదే గ్రామానికి చెందిన మానవత సభ్యుడు పాతూరి హరనాథ్ మరో రూ.5 వేలు అందించారు. గ్రామానికి చెందిన మరో అనారోగ్య బాధితురాలు ఉండ్రాజవరపు వెంకటలక్ష్మికి రూ.4 వేలు, జగన్నాథపురంలో మరో బాధితుడు నూకం రమేష్‌కు రూ.4 వేల చొప్పున మానవత సంస్థ అందజేసింది. ఆయా కార్యక్రమాల్లో సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్య నారాయణ, ప్రతినిధులు భోగవల్లి వెంకట సుబ్బారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, నందం రాజేంద్ర ప్రసాద్, పాతూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రచారం



వేగేశ్వరపురంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం ప్రచారం చేశారు. మండలంలోని బల్లిపాడు, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సచివాలయాల్లో ఉద్యోగులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

విరగపూత

- ఆశాజనకంగా జీడిమామిడి, మామిడి పూతలు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- 9,899 హెక్టార్లలో జీడిమామిడి సాగు



దేవరపల్లిలో ఆశాజనకంగా ఉన్న మామిడి పూత



దేవరపల్లి మండలం పల్లంట్లలో విరబూసిన జీడిమామిడి చెట్లు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన మామిడి, జీడిమామిడి తోటలు విరగబూశాయి. పూతలతో తోటలు కళకళలాడుతున్నాయి. సకాలంలో పూతలు రావడం వల్ల తోటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అంటున్నారు. మార్చి నెలాఖరుకు పంట దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణం జీడి మామిడి, మామిడి తోటలకు అనుకూలంగా ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. పగలు ఎండలు, రాత్రి ఉక్కపోత వాతావరణం ఉండడం వల్ల పూతలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు తెలిపారు. గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో జీడిమామిడి పంట సాగు చేస్తున్నారు. మామిడి పంట సాగు విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ, జీడి మామిడి ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉంది. 5 నుంచి 40 ఏళ్ల జీడిమామిడి, మామిడి తోటలున్నాయి. ఎకరాకు 4 నుంచి 10 బస్తాల దిగుబడిని రైతులు సాధిస్తున్నారు. నాటు రకాల తోటలు ఎకరాకు 4 బస్తాల దిగుబడి వస్తుండగా, హైబ్రీడ్ రకాల వంగడాలు సాగు చేస్తున్న రైతులు 10 నుంచి 12 బస్తాల దిగుబడులు సాధిస్తున్నారు.

9,899 హెక్టార్లలో..

మూడు నియోజకవర్గాల్లోని ఎనిమిది మండలాల్లో 9,899 హెక్టార్లలో జీడిమామిడి పంట సాగు చేస్తున్నారు. ద్వారకా తిరుమల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో జీడిమామిడి తోటలున్నాయి. ద్వారకా తిరుమల మండలంలో 2,300 హెక్టార్లు, దేవరపల్లిలో 1,352, గోపాలపురంలో 1,198, నల్లజర్లలో 707, చాగల్లులో 904, తాళ్లపూడిలో 333, కొవ్వూరులో 179 హెక్టార్లలో జీడిమామిడి పంట సాగు చేస్తున్నారు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

జీడిమామిడి పంట సాగు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నారు. దిగుబడులు తగ్గడం, పెట్టుబడి ఎక్కువ కావడం, గింజలకు గిట్టుబాటు ధర పలకకపోవడంతో రైతులు జీడిమామిడి తోటలను తీసి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా వర్జీనియా పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడి, ఊహించని లాభాలు రావడడంతో ఈ ఏడాది రైతులు జీడిమామిడి తోటలను తీసేసి పొగాకు సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో దాదాపు 500 హెక్టార్లలో జీడిమామిడి తోటలను తీసి వేసినట్టు అధికారులు తెలిపారు. ఈ భూముల్లో పొగాకు, ఆయిల్‌పామ్, కొబ్బరి వంటి పంటలు సాగు చేస్తున్నారు. పొగాకు సాగుకు భూముల కౌలు ధర ఎకరం రూ.70 వేలు పలకడంతో జీడిమామిడి తోటలను తొలగించి చాలా మంది రైతులు భూములను కౌలుకు ఇచ్చారు. ఏడాది పొడవునా జీడిమామిడి పండించినా ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు రావడం కష్టంగా ఉందని రైతులు అంటున్నారు. శ్రమ, పెట్టుబడి లేకుండా ఎకరాకు కౌలు రూ.70 వేలు వస్తోందని రైతులు తెలిపారు. ఆయిల్ పామ్, కొబ్బరి ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రావడం, ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడం వల్ల ఎక్కువ మంది రైతులు అటు ఆసక్తి చూపుతున్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల, చిన్నాయగూడెం, చాగల్లు మండలం చిక్కాల గ్రామాల్లో దాదాపు 100 ఎకరాల్లో ఈ ఏడాది జీడి మామిడి తోటలను తొలగించినట్టు తెలిసింది.

నాటు గింజలకు గిరాకీ

నాటు జీడిమామిడి గింజలకు మార్కెట్లో గిరాకీ ఉంది. బస్తా(80 కిలోలు) గింజలు ప్రస్తుతం రూ.13,500 పలుకుతున్నట్టు రైతులు తెలిపారు. అయినా పంట గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. ఎకరాకు 4 బస్తాల దిగుబడి వస్తోందని, పెట్టుబడి రూ.20 వేల నుంచి రూ.30 వేలు అవుతుందని రైతులు తెలిపారు. మెట్ట ప్రాంతంలో జీడిపప్పు తయారీ పరిశ్రమలు ఉండడం వల్ల వ్యాపారులు నాటు గింజలను కొనుగోలు చేస్తున్నారు.

పూతలు బాగున్నాయి



జీడిమామిడి పూతలు బాగున్నాయి. సకాలంలో పూతలు రావడం వల్ల ఎటువంటి చీడపీడలు లేకుండా ఆరోగ్యకరంగా ఉన్నాయి. మార్చి నెలాఖరుకు దిగుబడి వస్తుంది. ముదురుగా పూతలు వచ్చిన తోటలు అక్కడక్కడా గింజ పడుతున్నాయి. వాతావరణం తోటలకు అనుకూలంగా ఉంది. సమానమైన ఉష్ణోగ్రత ఉండడం వల్ల పూతలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ వాతావరణం ఇలాగే ఉంటే దిగుబడులు బాగుంటాయి. గత ఏడాది ఎకరాకు ఎనిమిది బస్తాల దిగుబడి వచ్చాయి. యాజమాన్య పద్ధతులు పాటించి, హైబ్రీడ్ వంగడాలను సాగు చేస్తే ఎకరాకు 10 నుంచి 12 బస్తాల దిగుబడి వస్తోంది. పెట్టుబడి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు అవుతుంది. నాటు గింజలకు గిరాకీ ఉంది.

– జి.రమణారెడ్డి, ఆదర్శ రైతు, గోపాలపురం

వాతావరణం అనుకూలం



జీడిమామిడి, మామిడి పూతలు ఆశాజనకంగా ఉన్నాయి. పూతలతో తోటలు కళకళలాడుతున్నాయి. పూత దశలో సాధారణంగా జీడిమామిడికి టి.దోమ వ్యాపిస్తుంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో దోమ ఎక్కడా లేదు. ఫిబ్రవరిలో పూతలు వచ్చినా, మార్చి నుంచి జూన్ వరకు దిగుబడి వస్తుంది. నాటు వంగడం ఎకరాకు 3 నుంచి 4 బస్తాలు, హైబ్రీడ్ వంగడం ఎకరాకు 8 నుంచి 10 బస్తాల దిగుబడి వస్తుంది. ఇసుక నేలలు, కొండ ప్రాంతాల్లో జీడిమామిడి పంట సాగుకు అనుకూలం. పూర్తిగా వర్షాధార పంట. ద్వారకా తిరుమల మండలంలో అత్యధికంగా 5,200 ఎకరాల్లో జీడిమామిడి పంట సాగు చేస్తున్నారు.

– ఎ.దేవదానం, ఉద్యానవన శాఖాధికారి, ద్వారకా తిరుమల

కృష్ణారావు కుటుంబానికి కలెక్టర్ పరామర్శ



సమిశ్రగూడెంలో కృష్ణారావు భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కలెక్టర్ నాగరాణి

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం గ్రామానికి చెందిన గారపాటి కృష్ణారావు సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన బంధువైన పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకం



ప్రత్యేకాలంకరణలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

ఉండ్రాజవరం: మాఘ మాసం షష్ఠి సందర్భంగా ఉండ్రాజవరంలో కోలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారికి మంగళవారం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీలింగ్ భూముల పరిశీలన



సీలింగ్ భూముల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

దేవరపల్లి: కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత మంగళవారం యర్నగూడెంలో పర్యటించారు. గ్రామంలోని పోతవరం రోడ్డులోని పామాయిల్ ఫ్యాక్టరీ సమీపాన సర్వే నంబర్ 307/4లో సుమారు 41 ఎకరాల సీలింగ్ భూములున్నాయి. వీటిని గతంలో దాదాపు 33 మందికి పంపిణీ చేసినట్టు రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. అయితే ఈ భూముల్లో అసలైన లబ్ధిదారులు లేకపోవడంతో, కొంత మంది వీటిని ఆక్రమించుకుని అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్టు కొంత కాలంగా ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఈ భూముల్లో ఐదుగురు లబ్ధిదారులు మాత్రమే ఉన్నారు. తమ భూమి ఎక్కడుందో తెలియకపోవడంతో మిగిలిన లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సీలింగ్ భూముల అమ్మకాలు జరుగుతున్నాయని, దీనిపై విచారణ జరిపించి లబ్ధిదారులకు అందజేయాలని గ్రామానికి చెందిన రైతు బొల్లిన రాధాచౌదరి ఇటీవల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్డీవో సుస్మిత ఆ భూములను పరిశీలించారు. రైతులతో ముఖాముఖీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వివిధ సమస్యలపై అర్జీలను పరిష్కరించినా అర్జీదారులు సంతృప్తి చెందకపోవడం, అవి రీ ఓపెన్ కావడం వంటి వాటిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించామని చెప్పారు. పెండింగ్ అర్జీలు పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, వీఆర్‌వోలు ఎం.శంకరం, బాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు నంబర్ రైతుకు తప్పనిసరి



దొండపూడి సచివాలయం వద్ద రైతులనుద్దేశించి మాట్లాడుతున్న రాజారావు

నల్లజర్ల: మండలంలోని రైతులందరూ 11 అంకెల విశిష్ట గుర్తింపు నంబర్ తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ సూచించారు. నల్లజర్ల, మార్లెమూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులందరూ ఈ గుర్తింపు నంబర్ పొందడం ద్వారా పీఎం కిసాన్, వ్యవసాయ శాఖ లబ్ధి పొందగలుగుతారని చెప్పారు. వరి, మొన్నజొన్న పంటలపై ఎటువంటి చీడపీడలూ ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పంట నమోదు తర్వాత ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి బబిత, ఏఈఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి బి.రాజారావు అన్నారు. దొండపూడి, రాజంపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వివిధ పథకాల లబ్ధి పొందాలంటే ప్రతి రైతూ ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని అన్నారు. ఒక రైతుకు ఎన్ని గ్రామాల్లో పొలం ఉన్నప్పటికీ ఏదో ఒక గ్రామంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరిపోతుందన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి 19వ విడత నిధులు జమ కావడానికి ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. మార్చి 25వ తేదీలోగా రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని కోరారు.

రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే

ఉండ్రాజవరం: భూముల రీ సర్వేను రైతుల సమక్షంలోనే నిర్వహిస్తారని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. రీ సర్వే పైలట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపికైన సత్యవాడలో మంగళవారం రీ సర్వే సమస్యలపై రైతులతో అవగాహన సమావేశంతో పాటు, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఏమైనా లోపాలుంటే రైతులు తమ వ్యవసాయ భూములను దగ్గరుండి సర్వే సిబ్బందికి సహకరించి, పరిష్కరించుకోవాలన్నారు. ఈ రీ సర్వే ద్వారా రైతులు తమ సమస్యలు పరిష్కరించుకుంటే, భవిష్యత్తులో రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 27తో ముగుస్తుందని, అనంతరం గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వేతో రైతులకు మేలు

నిడదవోలు రూరల్: భూ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ అన్నారు. తాడిమళ్ల గ్రామంలో భూ సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రీ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. రైతుల అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ, సర్వే సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రదీప్‌కుమార్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

రైతుల నుంచే కూరగాయలు కొనండి



వీఎల్ పురం రైతుబజార్‌లో రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ విజిలెన్స్ బృందం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం వీఎల్ పురం, వై.జంక్షన్‌లోని రైతు బజార్లను మంగళవారం మార్కెటింగ్ విజిలెన్స్ బృందం పరిశీలించింది. కొవ్వూరు మార్కెట్ కమిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి సునీల్ వినయ్, నిడదవోలు, రాజానగరం మార్కెట్ కమిటీ సెక్రటరీలు సత్యనారాయణ, రామ్మోహనరావులు రైతుబజార్లలోని రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు పండిస్తున్న పంట వివరాలను తెలుసుకుని, ఇకపై రైతుబజార్‌కు తీసుకువచ్చే ప్రతి పంట రైతుల నుంచి తీసుకు రావాలన్నారు. హోల్‌సేల్(దళారీలు) నుంచి కొనుగోలు చేయరాదని విజిలెన్స్ బృందం ఆదేశాలు జారీ చేసింది.

ఆటపాటలతో విద్యనేర్పాలి

తహసీల్దార్ అచ్యుతకుమారి



శిక్షణను ప్రారంభిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్ జయలక్ష్మి



అంగన్‌వాడీ టీచర్ల శిక్షణను ప్రారంభిస్తున్న ఎంఈఓ తిరుమలదాస్

పెరవలి: బాలబాలికలకు చిత్రాలు చూపించి, ఆటపాటలతో విద్యనేర్పిస్తే వారు త్వరితగతిన అవగాహన చేసుకుంటారని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి తెలిపారు. పెరవలి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, ఎంఈఓ షేక్ నూర్జాన్ మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో విద్య అందించాలన్నారు. మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు 64 మంది ఉన్నారని వీరందరికీ ఈ నెల 25 వరకు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. సీడీపీఓ డి.శ్రీలక్ష్మి, రిసోర్స్ పర్సన్‌లు ఎస్.పద్మ, కె.దుర్గాదేవి, సూపర్‌వైజర్లు సరోజి, లక్ష్మి, ఆనంద్ పాల్గొన్నారు.

దేవరపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులందరూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా ప్రయత్నం చేయాలని ఎంఈఓ ఎం.తిరుమలదాస్ సూచించారు. మండలంలోని 79 అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లకు ఆరు రోజుల శిక్షణను స్థానిక అంబటి సత్యనారాయణ రావు జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ఆయన ప్రారంభించారు. శిక్షణకు జిల్లా రిసోర్స్ పర్సన్లుగా వై.శ్రీదేవి, ఎం.మహాలక్ష్మి, కె.నీరజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.విజయలక్ష్మి, ఎం.శశికళ, బి.విజయశాంతి వ్యవహరిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 అప్పారావు, హెచ్‌ఎం కె.శ్రీలక్ష్మి, సీడీపీఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ప్రారంభించారు. శిక్షణను ప్రారంభించిన ఎంఈఓ యు.గురునాథం మాట్లాడుతూ, పిల్లల సమగ్ర అభివృద్ధికి, పిల్లల అభ్యసన నైపుణ్యాలు పెంపొందించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. మండలంలో మొత్తం 54 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, శిరీష, విద్యా శాఖ తరఫున పిల్లి శ్రీనివాసమూర్తి, జె.నాగరాజు, వీజీవీ సుబ్బలక్ష్మి డీఆర్పీలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్షా ఏఎస్‌ఓ వైవీ ప్రసాద్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంఈఓ-2 సుభాకర్, హెచ్‌ఎం మోహనకృష్ణ పాల్గొన్నారు.

గోపాలపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే చిన్నారుల భవితకు పునాదులు ఏర్పడతాయని ఎంఈవో జి.శ్రీనివాసరావు అన్నారు. గోపాలపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీఓ కె.నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ లో ఆయన మాట్లాడారు. సీడీపీఓ నాగలక్ష్మి, సూపర్‌వైజర్లు జేవీ రమణ, కె.విజయ కుమారి, రిసోర్స్ పర్సన్లు మిరపల నాగేశ్వరరావు, బాలాజీ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పిల్లల్లో పునాది అభ్యసనను మెరుగుపర్చడానికి జ్ఞాన జ్యోతి శిక్షణ ఉపయోగపడుతుందని ఎంఈవో సీహెచ్ సక్సేనారాజు అన్నారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో వి.రామారావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ ఈ శిక్షణను ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్లు సక్సేనా రాజుతో పాటు, సీడీపీవో శ్రీలక్ష్మి, హెచ్‌ఎం మాణిక్యాలరావు, డీఆర్పీలు యర్రా కాశీవిశ్వనాథం, తమ్మిశెట్టి శ్రీనివాస్, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో విద్యాశాఖ, శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులను మంగళవారం తహసీల్దార్ నాగరాజునాయక్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ ప్రారంభించారు. సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఆరు రోజులపాటు శిక్షణ నిర్వహించనున్నారు. తహసీల్దారు నాగరాజు నాయక మాట్లాడుతూ పూర్వ బాల్య సంరక్షణ, విద్య, అభ్యసన బోధనపై అంగన్‌వాడీలు పూర్తి అవగాహన ఉండాలన్నారు. మున్సిపల్ డీఈ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పిజనళిని, యు.పద్మ, ఎంఈవోలు కేఎస్‌వీ గణేష్, పి.గురుమూర్తి, ఎల్.సత్యనారాయణ, రిసోర్స్‌పర్సన్స్ రాములు, ఆరిఫాబేగం, లూథర్ థామస్, సీఆర్పీలు రాజేంద్రప్రసాద్, పుష్పవల్లిశ్వరి పాల్గొన్నారు.

నల్లజర్ల: బాల్య సంరక్షణ, విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సు శిక్షణను నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో ఎంఈఓ వై.సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంవత్సరానికి రెండు దఫాలుగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. మొదటి దశలో 6 రోజులు తరగతి గదిలోను, మరో 14 రోజులు ఆన్‌లైన్‌లోను శిక్షణ ఉంటుందన్నారు. ఇదే విధంగా రెండో దఫా మరో 20 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. ఇలా సంవత్సరానికి 40 రోజుల చొప్పున మూడేళ్లలో 120 రోజుల పాటు జ్ఞానజ్యోతి శిక్షణ జరుగుతుందన్నారు. రిసోర్స్ పర్సన్లు జయలక్ష్మి, చిట్టిబాబు, సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, కృష్ణవేణి, హారతి తదితరులు పాల్గొన్నారు.

జీబీఎస్ వ్యాధి లక్షణాలుంటే ఆసుపత్రులను సంప్రదించండి



కొవ్వూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి

కొవ్వూరు: గిల్లియన్ బరే సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధికి చికిత్స ఉందని, లక్షణాలు కనిపిస్తే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించి చికిత్స పొందవచ్చునని డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి ప్రకటించారు. గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు, గోకవరం, కడియం సీహెచ్‌సీలతోపాటు అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్లు, వైద్యులతో జీబీఎస్ వ్యాధిపై మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీబీఎస్ వ్యాధి గురించి ప్రజలు భయపడనవసరం లేదన్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వ్యాప్తి చెందే అవకాశం లేదన్నారు. మనిషిలో రోగ నిరోధక వ్యవస్థ, నరాలపై పని చేసినప్పుడు మన కండరాలు బలహీన పడడం ద్వారా ఈ వ్యాధి లక్షణాలు బయట పడతాయన్నారు. ఆహారం తినే ముందు, బయటి నుంచి వచ్చిన సమయంలో కచ్చితంగా కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. జీర్ణ కోశ వ్యవస్థకు సంబంధించిన బ్యాక్టీరియా, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు, జలుబు, దగ్గు తరచూ రావడం, తగ్గిన తర్వాత ఆరు నెలలు వ్యవధిలో ఈ లక్షణాలు కొందరిలో కనిపించే అవకాశం ఉందన్నారు. అన్నీ సామాజిక ఆసుపత్రుల్లోను చికిత్స అందుబాటులో ఉందన్నారు. ఆసుపత్రుల్లో మందుల లభ్యత, చికిత్స, సౌకరాలపై ఆమె ఆరా తీసి పలు రకాల సూచనలు చేశారు.

గిరిజన హక్కుల పరిరక్షణపై అవగాహన



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో 'గిరిజన హక్కుల పరిరక్షణ-అమలు'పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇందులో శ్రీలక్ష్మి మాట్లాడుతూ గిరిజనులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, నల్సా వారి (గిరిజన హక్కుల రక్షణ మరియు అమలు) పథకం 2015 గురించి వివరించారు. గిరిజనులు హక్కులను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలన్నారు. వారికి అందుబాటులో ఉన్న పథకాలను తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి సహకారం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సదస్సులో డిస్ట్రిక్ట్ ట్రైబల్ ఆఫీసర్ కేఎన్ జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ సిబ్బంది, న్యాయవాది డి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

హాస్టల్ పరిశీలన

స్థానిక ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని, కేవీ స్టేట్ హోం, బాల సదన్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.శ్రీలక్ష్మి సందర్శించి వసతులు పరిశీలించారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారికి అందిస్తున్న సేవల గురించి వివరించారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా, న్యాయ సహాయం కావాలన్నా తెలపాలన్నారు.